

# గర్వకారణం

బలివాడ కాంతారావు

ఈ పరిసరాలు యించు మించు సుందరానికి చిన్ననాటినించి పరిచయమైనవే. ఈ వరండా దాని యెదరగా వున్న కాగు చెట్టు- ఈ నాటివి కావు. కాగు చెట్టుతనంత పొడవు మొక్క తనకన్నా ఎదిగి పోయింది. అడిగి మరీ యెందరో చెట్టెక్కి కొమ్మలు పళ్లతోముకునే పుల్లల కోసం కోను కుంటున్నారు. బహుశః ఆ చెట్టు వదిలినగాల్లి నిత్యం పీల్చటం వలన అతని ఆరోగ్యాన్ని రక్షించిన తన అందానికి తనే మురిసి పోయినట్లు చేసిందేమో? ఈ వరండానించి అరిస్తే యీ వూరిపెద్ద సుందరం గర్జన సింహ గర్జనకదా? ఆ గర్జన చెయ్యడానికి ఆలోచన అఖ్ఖర్లేదు. అసలు తనకొక మనసుందని, ఆరాటపడుతుందని ఏడాది క్రితం వరకూ తెలుసుకోలేక పోయాడు. తన ఉంగరాల జుట్టు,ఠీకైనముక్కు, వెలుగును వెదజల్లే కళ్లు, అందమైన శరీరం వీటినే సుఖపెట్టాలని తాపత్రయ పడ్డాడే గాని తప్పు ఒప్పులను, న్యాయా న్యాయాలను, నీతి అవినీతి యిలాంటి జటిలసమస్యలను విశ్లేషించే మనసు యీ అందగానిలో దాగున్నదని, దానిని వాడు కుంటే యిహం, పరం అనేది అర్ధం అవుతుందని,యేనాడు అనుకోలేదు. ఈ వరండా దాని మీదకుర్చీ ఒకనాటి అధ్భుతమైన సాహసమైన ప్రేమ గాధలకు రంగంగా నిల్చింది. ఇప్పుడు యీ భయంకరమైన శరీర పరిస్థితితో తనకొమనసు వుందని, యిన్నాళ్లు దీనిని ఒక బంజరుభూమిగావుంచానని తోచింది. ఎన్నోగొప్ప మనసులు వదలిన ఆలోచనలు తనమనసు లోనికి పారినట్టుచేస్తే యీ భూమి సస్యస్యామలమయ్యేది. ఇప్పుడు విచారిస్తేయేంలాభం ? విచారించకుండా వుండలేడు కదా!

ఏ వరండా నించి సింహగర్జన చేసే వాడో ఆ వరండా మీద మంచంపై సుందరం యిప్పుడు పడివున్నాడు. పక్షవాతంతో ఏడాది నించి మంచంమీద వున్నాడు. ఈ మధ్య మాటకూడా సరిగ్గా రావడం లేదు. చెవులు వినివిన్నున్నాయ్. చిన్న శబ్ధాలకే త్రుళ్లి పడుతున్నాడు. కళ్లమనకలు కమ్మినా మనుషుల వేపు నిదానంగా చూసిపోల్చుకో గలుగుతున్నాడు. ఒకప్పుడు తనంటే భయపడ్డ వాళ్ళనుచూసి తనే యెందుకు భయపడి పోతున్నాడు? ఇది తన మనసుకు పట్టిన రోగమా?



చూడవచ్చిన వాళ్ళకు యీ సింహం మింగేస్తుందన్న భయం లేదు. చెవులపిల్లికన్నా అధ్వాన్నంగా వున్న పరిస్థితిని చూసి వాళ్ల వాళ్ల అభిప్రాయాలు అక్కసులు వెళ్ళగ్రక్కు తున్నారు. ఒకడు వేదాంతిలా వున్నాడు. ఆ మాటలు సుందరం చెవిలో గుచ్చుకున్నట్లు పడ్డాయి. వాడు మంచం ప్రక్కనే కుర్చీమీద కూర్చొని.

"మనిషి పుట్టాక యమపాశం యెప్పుడో ఒకనాడు మెడలో పడటం తప్పదుకదా! ఎప్పుడు యెలాపడుతుందో ముందుగా యెవరూ చెప్పలేరు. అదృష్టవంతులకి వెంటనే ఆ పాశం లాగేస్తాడు. దురదృష్ట వంతులకి యేళ్ళతరబడి లాగకుండా హీనంగా బతకనిస్తాడు.

వాడిమీద యెంతో కోపం వచ్చింది. చెయ్యెత్తి ఫడీమని చెంప పెట్టు పెట్టాలని

పించింది. కానీ ఆ చెయ్యియెత్తలేదు. ఆ యేమీ తెలియని వాడు అన్నీ తెలిసినట్లు మాటాడుతున్నాడన్న బాధతో మూలుగుతూ మంచంమీద పడి వున్నాడు. బలం వుడిగినా పంతం చచ్చిపోలేదు. పచ్చగా వున్న రోజుల్లో పదిమంది పొగడ్తలు గుర్తుకొచ్చినయ్. వెన్నెల్లో విహారాలు, వగలాడు మూతితో వెన్నముద్దలు తన నోటిలో కుక్కిన దృశ్యాలు, ఆ శరద్రాత్రులు చీకటి రాత్రులు కావే! ఆ తీపి వెన్నముద్దలు రాతి ముక్కలా మరచిపోడానికి! ఈ నాటి ఉదయం పొగమంచు బాగా చూడలేకపోయినా ఆ రోజుల్లో పొగమంచులో తను పొందిన అనుభూతులు జ్ఞప్తికి వున్నాయ్. ఈ వేళ భార్య సావిత్రమ్మ స్నానం చెయ్యించి కుర్చీమీద కూర్చోబెట్టే- అన్ని సంవత్సరాలుగా వంటపట్టిన అలవాట్లు అంతవేగిరం సమసి పోతాయా ? ఎదరగా నీలాటిరేవుకు పోయేవీధి, అలా నీటి కోసం యీనాడు కాదు యీవూరు పుట్టిన దగ్గరనుంచి ఆడంగులు అలానే కదలుతున్నారు. ఇదివరకు ఆ కుర్చీమీదే కూర్చుంటే తనవేపు కొందరుచూసి నవ్వులు పువ్వులుచేసి విసిరేవారు. కళ్లల్లో కళ్ళు కలిపేవారు. తన నవ్వుకు జవాబుగా నవ్వి మరీ కదిలేవారు. ఏపని లేక పోయినాయిద్దరాడంగులు ఆగి తనవేపుచూసేమెరిసేబిందెలు చంకన పెట్టుకుని మాటాడేవారు. ఊర్లో గోపాలునిగా మేలుబడి చేసాడు. అప్పుడు తన మగసిరికి దాసోహం అన్న ఆడవాళ్లచూపులు గిలిగింతలు పెట్టేసి ఆనాడు యేటిప్రవాహంలా శరీరంలో కదలే నరాలపొంగుయీనాడు యెండిపోయిన నదిలా వుందేమి? అప్పటి కోరిక యిప్పుడు కనికరంగా మారిందేమి?పచ్చని వరహాలా కనిపించిన వారి కళ్ళకే యిప్పుడు గజ్జికుక్కలానో పుచ్చిపోయిన పండులా కనిపిస్తున్నానెందుకు? ఇటుచూడకుండా ముఖాలు తిప్పుకుని గబగబ కదిలిపోతున్నారు. పగవానిలా చూస్తున్నారెందుకు? అరవలేడు, నడవలేడు, నడుం విరిగినట్లు పడివుండి కోపంతో పళ్లు పటపట కొరుక్కుంటే ఆ పళ్ళువిరిగి పోతున్నట్లయి తన నాలుకను తనే కరచు కున్నాడు.

అన్ని రుచులున్న ఆ జీవితం తలచుకుంటే అందులో ప్రధానమైన ఉప్పు లేదనిపించింది. ఆ రుచులు పుట్టించిన అహం మధ్యలో సమసిపోవడం కష్టం. పోయినా కడుపులో పురుగుల్లా మళ్లీ మళ్ళీ పుట్టుంటుంది. రుచిపోయిన నోటిలో యింతపంచదార పోసుకున్నట్లు పాత ఈలోచనలను యీ అవమానపు గడియల్ని మరచిపోడానికి నెమరువేసుకుంటుంటే సాయంత్రం అయి పోయింది. అప్పుడు దూరదూరాలనించి వచ్చిన పరదేశమ్మను చూడగానే సుందరం బలం పుంజుకుంది. కాళ్ళు చేతులు పడిపోయి నప్పటినించీ ప్రతిక్షణం పరదేశమ్మ గురించే తలచుకున్నాడు. తన దగ్గర లేకపోయినా-తననీడనే పరదేశమ్మగా భావించినవాడు. తొలకరిలో నిండిన చెరువులా వుండేది. తొలిచూలుకు కొడుకును కన్నది. వాడిని చూసిన వాళ్లంతా బయటకు అనకపోయినా లోలోన వాడిరూపును చూసి వాడు సుందరంకే పుట్టాడనుకుంటారు. ఆ ఒక్కసంతానమే. మరిలేదు. ఎదరగా పరదేశమ్మ కొడుకు మురళి నిల్చున్నాడు. అది తను పెట్టినపేరే. నిజంగా మురళీకృష్ణుని లానే వున్నాడు. నూనూగు మీసాలతో యెంత వాడయ్యాడు! తనను చూసి భయ పడుతున్నట్లు వెళ్ళిపోదామని తల్లి చేతిని పట్టుకుని లాగుతున్నాడు. ఎన్నడూ పరిచయం లేనట్లు ముభావంగా "మా మరది పెళ్లికి వచ్చాను. బాగులేదని వినిచూసి పోదామని వచ్చాను" అని తేల్చేసి వెళ్ళి పోయింది. అసలు వచ్చినట్లే లేదు. ఇన్నాళ్ళు యెదురు చూసిన కళ్లకు సరిగ్గా ఆనకుండానే వెళ్లిపోయింది. గాయంకెలికినట్లు కెలికి వెళ్లి పోయింది.

ఒకప్పుడు పట్టెమంచం-పరుపుమీద పడుకోబెట్టిన పరదేశమ్మ యీనాడు జింకతోలు పరచి దీనిమీద చావు అన్నట్లు అనిపించింది. మొగుడ్ని వీధిలో ధాన్యం కొట్టుకు కాపలాపెట్టి పెరటిత్రోవ తనను గదిలోనికి తెచ్చుకుని కొబ్బరికోరు- పంచదారతో పెద్దగ్లాసునిండా బాగాకాచిన పాలు రోజూరాత్రుళ్లు తాగించిన పరదేశమ్మే యిలామారి పోయిందంటే ప్రణయానికే పోయేకాలం వచ్చిందనిపించింది. శౌర్యంపుట్టింది. కానీ యీక్షణంలో తన చాతకాని శౌర్యం యెవరోచెప్పినట్లు పదునులేని కత్తిలావుంది. ఆ కత్తితో తన పీక కోసుకోవాలనిపించినా చీకటిపడేసరికి ఆ శౌర్యం కరిగిపోయి కన్నీరుగా మారిపోయింది. నరాలన్నీ యెండిపోయి యెముకలు కుళ్లిపోయి, కండలు కరిగిపోయిన ముద్దలా మంచం మీద ముడుచుకు పోయాడు.

"ఆ మురళి నా కొడుకే. వాడికీ తెలియదు. దానికి తెలుసు, దాని మొగుడికీ తెలియదా? "పక్కన కూర్చోబెట్టుకొని శరీరంతో తాకి ఒకముద్దుపెట్టాలనిపించింది. కానీ వాడు కొరకొరా తనవేపు చూస్తునే వున్నాడు. "నిన్నుయీ లోకానికి తెచ్చిన అసలు నాన్నరా! వెళ్లి ఒక్కసారి ఒకముద్దుపెట్టు"అని పరదేశమ్మఅనివుంటే ...కోరి కోరి నాతో జతకట్టింది. కుంటివాడు పుట్టలేదే! నా రూపురేఖలతో పుట్టాడే. అది యీనాటికి కోతిముండబుద్ధులను అలవరచుకుందిగానీ ఆరోజుల్లో నన్ను తీగలాచుట్టుకొని ఆ తీగపండించిన తియ్యటి ద్రాక్షను నా నోటపెట్టేదికదా! ఇప్పుడు దానిగీత బాగుందని వుత్తమ యిల్లాలై పోయినట్లు నటించేస్తోంది.



గువ్వలా అది గూడెక్కి కూర్చుంది కదా- మేడదిగిన రాజులా వున్నాను. నా అవసరం దానికేంవుంది? "అని వాపోయాడు.

తరువాత స్వంత కొడుకు జ్ఞప్తికి వచ్చాడు. తనయింటి పేరున్న ఒక్కకొడుకు వాసు సంగతి తలస్తేనే గుండెభారం.తనకు యెంత దూరంలో వుంటే అంతమంచిదని, పటాలంలో చేరి యిప్పుడు కాశ్మీరులోవున్నాడు. రానేరాడు. వచ్చినా యింట్లో వుండడు. పెళ్లి చేసుకోడు. కొడుకని వాడితో యేమీచెప్పుకోలేడు. చెప్పినా వెటకారం. ఈతండ్రి అవసరం వాడికి అసలే లేనట్లు వుత్తరాలైనా రాయడు. ఆ సంపాదనంతా యేమీ చేస్తున్నాడో? మిగిలింది తనకు పంపిస్తే పాడుచేస్తానని భయమేమో? "మీ నాన్న మంచం దిగలేకపోతున్నాడు చప్పున రారా" అని రెండు వుత్తరాలు ఆతల్లి రాస్తే వచ్చాడు. శలవు లేదని మూడోరోజే వెళ్లి పోయాడు. తల్లిపెళ్లిచేసుకోరా అంటే ఒకసారి తలదించుకున్న తల్లివేపు అదేపనిగా చూసి "ఎదుటవాళ్లకష్టాలతో బతకడం యిష్టం లేదన్నాడు."

నేను వాడి అమ్మకు పెట్టిన కష్టాలను మనసులోపెట్టుకునిఅన్నమాట లేకదా యివి! అయితే వీడితో యీ వంశంసరా! తనేమైపోతే వీడు తనను బుగ్గిచేస్తాడా? తల్లి యింకా బలవంతం చేస్తే అమ్మవేపు దిగాలుపడి చూస్తున్నాడు. తనంటే యెందుకో యీ కోపం? తనతాత గడింపులో సగం హారతి కర్పూరంలా తన విలాసాలకు ఖర్చుపెట్టాననా? ఈ పురుగు పట్టిన పండుతినే కన్నా దూరాన్న పాతిపెట్టేడం మంచిదన్నట్లు తన వేపు చూస్తారెందుకు? పెళ్లిచేసుకోనంటే చేసుకోనన్న కొడుకుతో చివరకు సావిత్రమ్మ "రక్తసంబంధాలలో ఒకరుచేసిన చెడుగును యింకొకరు మరచి పోతేగానీబతకలేంరా"అన్నది.

జవాబుచెప్పకుండా వెళ్ళిపోయాడు. వాడున్నా లేని : జమే అనుకున్నాడు. ఒకప్పుడు వాడియెదరగా వాడితల్లిని తిట్టాడు. చెయ్యి చేసుకున్నాడు. చిన్నవాడి మనసులో యీకృత్యాల వలన రాక్షసునిగా ప్రతిష్టింప బడ్డాడేమో! ఇంట్లోపెళ్లంవుందని మరచిపోయిన తను వీధిలోనే కాపరం పెట్టినట్లు విచ్చల విడిగా విహరించాడు. ఇప్పుడు మౌనంగా సేవ చేస్తునందుకు పెళ్లానికి యీ మిగిలిన ఆస్థి అంతా రాసేస్తాను. వయసుండి ముసలివాడై శాప గ్రస్తునిలా వున్నాననుకున్నాడు. అదేంటో తను ఆరోగ్యంగా వున్నప్పుడు లేని ఆలోచనలు యిప్పుడొక్కసారిగావరదవెల్లువలా వస్తున్నాయి. ఎవరు చూడడానికి వచ్చి యేమాటన్నా అందులో ద్వందార్థాలు వినిపిస్తున్నాయి. ఎవరూ చూడడానికి రాకపోయినా గతంలో సుఖం కోసం చేసిన పనులు జ్ఞప్తికి వచ్చి యిప్పుడు చర్మరోగం వచ్చినట్లు బాధ పెట్టున్నాయ్. నిద్దరపట్టక అలామంచంమీద ఒంటరిగా పడుకుని మనసు చివుక్కుమని "యిలాచేయక పోవలసింది, అలా చెయ్య వలసిందని" గతంలో చేసిన పనులు సింహావలోకనం, చేస్తుంటే ఆ ఆలోచనలన్నీ వడగళ్ళవానలా తనను నడివీధిలో బాదు తున్నాయ్. పోనీ కాస్సేపు నిద్దరపోతే పాడుకలలే. ఒక్కమంచికలగుర్తుకు రాలేదు. ఈ ఆలోచనలు భయంపుట్టిస్తున్నాయి. చావుకు యిది వయసుకాదు. ఇదివరకు తనెప్పుడు చావుకు భయపడి యెరగడు. ఎందరిశవాలో మోసిదహనకాండలో పాల్గొన్నాడు. పిల్లల శవాలను భుజంమీద వేసుకొని పాతిపెట్టాడు. ఒక స్నేహితుడు చివరిక్షణాలలో యెలా ప్రాణంవదిలాడో వాడి ప్రక్కన కూర్చునే చూసాడు. బలవంతపుచావుల్ని చూసాడు. బస్సుయెక్కుతూ జారిచక్రాల క్రింద పడ్డవాళ్ళనూ చూసాడు. తనకు చావంటే అప్పుడు భయంలేదు. అప్పుడు తనలో మనసు లేదేమో! లేక కరడుకట్టుక పోయిందేమో? అప్పుడు తనపొందికైన శరీరాన్ని యెంత హెచ్చు సుఖపెట్టే అంత హాయిగా బ్రతుకుతానన్న ధ్యాసే కదా ! ఇప్పడీ ఆలోచనలు చావుకు సమీపిస్తున్నావు సుమా అని సూచిస్తున్నాయి. ఎవరో అన్నారు కదా చావుజీవితానికివిషం అని. కర్కోటక విషం నాలికకి తగిలితే చావేకదా! నింపాదిగా చంపేవిషాన్ని తనుమ్రింగానని అదెలా బయటకు కక్కాలో తెలియటంలేదు. ఒక విధంగా చావు కోసం కాసుకుని వుండటం మంచిదేమో?ఈ కాపలాతో జీవితవిలువల్ని తెలసుకుంటున్నానేమో? తండ్రి దరిద్ర గండం తప్పించాడు. రెండోగండం యీ చావు తప్పించుకోగలడా? "ఈ శరీరానికి యింత సేవచేసాను. నవరుచులు తినిపించాను. మంచిబట్టలతో సింగారించాను. ఇంతసేవ చేసినందుకు యెలాచెప్తే అలా వినవలసిన యీ శరీరం యిప్పుడు మందువేస్తేమింగని పసిపిల్లవానిలా మారాంచేస్తోందెందుకు? ఈ చచ్చే కాలానికి తనేదో యిన్నాళ్ళు వేషంవేసి బ్రతికానన్న తలవును పుట్టిస్తోంది. ఈ నవద్వారాలు సరిగ్గా పనిచెయ్యకుండా నాదీ అనుకున్న యీ శరీరం నాది కాదు యిది అద్దెయిల్లని స్పురింపజేస్తుంది. మనిషికి మూడు విషయాల్లో విశ్వాసం వుంటేగానీ బ్రతక లేడంటారు. ఇంతమంది తనని చూడటానికి వస్తున్నారు. ఇందులో విశ్వాసం వున్న వాళ్ళెవరు?'

ఒకప్పుడు అద్దంలో తన నీడను చూసికొని మురిసిపోయాడు. తనవెంట నడుస్తున్న నీడతనదేనని గర్వపడ్డాడు. ఇప్పుడు



ఆ నీడవేపు చూడలేడు. అద్దంలో తన నీడను చూడలేడు. తనవెంటనున్ననీడ తనలో కలిసిపోతే అదిచావునీడని నిర్ధారణ అవుతుంది. "నీవెంటనున్న నీడ నీదికాదు. అది చిత్రగుప్తుని ప్రతినిధి. నీవుచేసిన మంచీచెడును ఆ నీడ బుర్రలో గుప్తంగావున్న కంప్యూటర్‌లో రికార్డు చేస్తుంటాడు."ఏనాడూ తట్టనిది యీనాడు తట్టింది. "ఇది అందమైనది ఇది కురూపి. ఈ చెట్టుఫలం పులుపు. ఆ పాదపువ్వు వాసన గలది. ఈ మనిషి'మనవాడు. ఆ మనిషి కురూపి. ఈ తెగ నీచమైనది. ఆ తెగమంచిది." ఇలా తనచుట్టూవున్న మనుషులతోనూ, పరిసరాల తోనూ, బంధువులతోనూ, ద్వంద్వ మైన బాంధవ్యాలు యేర్పరచుకున్నాడు. ఇష్టమైన వానితో పొత్తుకుదుర్చుకున్నాడు. అయిష్టమైన వాటికి దూరమయ్యాడు. తను మంచి ప్రవర్తనతో తన చెడుగును దాచుకున్నవాడా లేక చెడుప్రవర్తనతో తనలోని మంచిని దాచుకున్నాడా? ఈ రెండురకాల మనుషుల్లో తను యేకోవకు చెందుతాడు?

ఇలా అదేపనిగా ఆలోచించే మనసుకు ఆరాటం హెచ్చయింది. అన్నీ తారుమారై పోతున్నట్లు అంటే ఒకప్పటి సుఖాలు యిప్పుడు కష్టాల్లా కనిపిస్తున్నాయి. లోపల దాగున్న టార్చిలైటు యేదో యీ నాటికి వెలిగి తనుచేసిన చెడ్డపనులను చూపిస్తోంది. భర్తలతో విశ్వాసంతో బ్రతుకుతున్న భార్యలను అవిశ్వాసపాత్రులుగా మార్చినతీరు ఒక నాటకంలో పాత్రల ఆటలా కనిపిస్తోంది. ఇన్నేళ్ళుబ్రతికినా తను నేర్చుకున్న జీవితసత్యాలేవీ లేవు. కృత్రిమ జీవితంతో బతికినవాడికి జీవిత విలువలేం తెలుస్తాయి? తన జీవితమంతా ఒకమాయ. క్రితం యేడాది వరకు తను చేసిన నేరాలకు శిక్షఅంటూ లేదు. అంతవరకు వయసు పెరుగుతున్నా కోరికలుపెంచుకుంటూ, ఆ కోరికలను సఫలం చేసుకుంటూ బ్రతికాడు. ఆ సఫలం చేసుకునే తీరులో కొంత చెత్తపోగవుతోందని తెలుసుకోలేక పోయాడు. ఇప్పుడు ఆ చెత్తంతా చెత్తల కుండీ నిండిపోయి బయట పడిపోతోంది. ఎత్తే వాళ్ళెవరూలేక కుక్కలూ, పందులూ యీ కుండీ చుట్టూ మూగుతున్నయ్. తను మనిషిని కానని పీటి మధ్యపెరిగిన జంతువని స్ఫురిస్తోంది ఈ పేరుకు పోయిన చెత్త నా అహంకారం, నా పేరుమీద మోజు, నా అందమైన శరీర శౌష్టవం మీద మమకారం, యీలోకంలో అన్నీ అనుభవించడానికి అర్హుడ్ని నేనొక్కడినే అనుకొని యీకంపు కొట్టున్న చెత్తను ప్రోగుచేసుకున్నాడు. దీనికి నిప్పంటించినప్పుడే యీ దుర్గంధం పోతుంది.

రోజులు గడుస్తున్నకొద్దీ సుందరంకు బ్రతకడం సులువు గానీ చావడం కష్టమని పిస్తోంది. అతనికి చావాలని కూడా లేదు. తన వలన అన్ని బాధలు పడ్డ భార్య నిరంతరసేవ ఒక్కటే తన జబ్బును కుదురుస్తుందన్న విశ్వాసం వచ్చింది. ఏనాడూ రానివిశ్వాసంతో యీనాడు "నాకు బ్రతకాలనివుంది. కనీసం కొన్నాళ్ళు నాపనులు నేను చేసుకునేటట్లు ఆరోగ్యంతో బతకాలి. అప్పుడు నాభార్య మీద అనురాగం చూపించి నావలన ఆమెకు తగిలిన గాయాలలో కొన్నయినా మానినట్లు చూడాలి. ఆమెను గౌరవించి నాకృతజ్ఞతను చెప్పుకోవాలి. ఈ యేడాది. లో ఆమె నడవడిచూసే యీ విశ్వాసం తెలుసుకున్నాను. ఆమె యందు విశ్వాస పాత్రునిగా కనీసం రెండేళ్ళయిన బ్రతకాలి.' ఇలా అతనిలో యిదివరకుండిన ఆలోచన యెరగని ఆవేశం బదులు యిప్పుడు ఆవేశం లేని ఆలోచనలతో భార్యయెత్తుకు మనిషిగా యెదగాలని ప్రయత్నిస్తున్నాడు.

కార్తీకమాసం సోమవారం ఉదయమే చలిలో యేటిలో స్నానంచేసి సావిత్రి వచ్చింది. రాసుకున్న పసుపుతో ఆ తెల్లని ముఖం బంగారు ఛాయనుసంతరించుకుంది. పెద్ద కుంకుమ బొట్టుపెట్టింది. పళ్ళేరాన్ని అరటిపళ్లు, కొబ్బరి కాయ ఊదివత్తెలు, పువ్వులతో నింపి పెళ్ళినాటి చీరకట్టుకుని శివాలయానికి బయలుదేరింది.

"ఏమని మొక్కుతావు ?"అని వినీ వినపడని మాటలైనా సావిత్రికి అర్థమయ్యాయి. "మీ ఆరోగ్యం బాగుపడాలనితప్ప మరేం మొక్కుతానంది" ప్రశ్నార్థకంగా చూస్తే "నాపసుపు కుంకుమను దేముడు తీసుకోలేదు' ' అని సావిత్రి కదిలితే "ఏమిటో దీని విశ్వాసం? అనుకున్నాడేగానీ బయటకు వేగిరం రా" అన్నాడు.

ఆ వేళ చలిగా వుంది. సాయంత్రానికి వరండాలో మంచాన్ని గదిలోనికి తెచ్చింది. తనకు ఉపవాసం అయినా భర్తకులేదుగా! సుందరం రోగానికి ఒక సుగుణం కూడా వుంది. తిండిపడి పోలేదు. కడుపునిండా తృప్తిగా తినిపిస్తే తిన్నాడు. భుక్తాయాసంతో మంచం మీద వాలిపోయాడు. సావిత్రి మంచాన్ని అనుకుని తనతలవేపు నేలమీదే కూర్చుంది. కాస్సే పయ్యాక సుందరంకు దగ్గరలో వున్న యేటి పారుదల గలగలలు వినిపిస్తున్నాయి. కిటికీ తెరిచేవుంది. ఆ కిటికీ నించి వెన్నెల్లో గాలికి కదులుతున్న కాగుచెట్టు ఆకుల శబ్దం వినిపిస్తోంది. కదిలేఎడమచేతిని మెల్లగా సావిత్రి భుజంమీద వేసాడు. ఆమె విషయంలో యెన్నడూ యెదగని శరీరం పొంగు విద్యుత్తులా తనలో కలిగింది. తను జబ్బుమనిషినన్న వూహే ఆ క్షణాల్లోరాలేదు. వెన్నెల రాత్రిలో కొత్త యౌవ్వనం వుబికి తొలిసారి ముగ్ధమనోహరిలా వున్న భార్యను కౌగలించు కున్నట్లు వూహించు కున్నాడు. ఆమె కాస్త వణుకుతోంది.



"చలివేస్తోందా? దుప్పటికప్పుకుని పడుకో"అన్నాడు. ఆ మాటలు వినపడనట్లే అలామంచం దండెపై ఒరిగి కూర్చుంది. మెల్లగా ఎడమచేతిని కదిపి ఆమెభుజంపై వేసాడు.

ఒళ్ళు చల్లగా వుందేం? సాయంత్రం కూడా స్నానం చేసావా? తన మాటలు తనకే వినబడనట్లుంటే సావిత్రి ఏం జవాబు చెప్తుంది. కాస్సేపయ్యాక ఆమె కొద్దిగా కదిలింది. తను అడిగిన ప్రశ్న ఒకటి ఆమె చెప్పిన జవాబు ఒకటి. గొంతుకలో వణుకుతో మాటలు స్పష్టంగా లేకపోయినా అతనికి అర్థం అయ్యేటట్లే "నేనొక యింటపుట్టాను. మీ యింటికి వచ్చాను. పెళ్ళి రూపాన మనకో బంధం పడింది. ఒకరు దిగజారిపోతే రెండోవారుపైకెత్తే బంధం కదాయిది. ఈ బంధం నించి ముక్తి ఆనాడు కోరలేదు. యీనాడూ కోరుకోలేదు. ఐనా యేంటో యెన్నడూ యెరగని వణుకు......"

మలిమాట రాలేదు. గాలి స్థంభించి పోయింది. ఆకులు కదలటం మానేసాయి. ఏరు పారిన శబ్దం వినపడలేదు. ప్రస్ఫుటంగా కనపడే నక్షత్రానికి మేఘం అడ్డుపడింది. మంచానికి ఆనుకున్న సావిత్రినేలమీద కుప్పలా కూలిపోయింది.

ఓరి యముడా! సావిత్రిని కాదు నన్నుచంపు" అని కేక వేసాడు సుందరం. ఆ కేక తన హృదయానికే గుచ్చుకుని బయటకు వినపడలేదు.

అన్నిలాంఛనాలతో దహనం చేసారు. చేయవలసిన తంతులన్నీ పూర్తయ్యాక కొడుకు వెళ్లిపోయాడు. ఏమీ అనలేదు. అడగలేదు. కనీసం తన గురించి యేమి ఆలోచించాడో యెవరితోనూ చెప్పలేదు. తనతల్లి యిలా రాత్రి పగలూ తనక్రింద సేవ చేస్తూ నీరశించి చచ్చిపోయిందనా వాడి అక్కసు! పోనీలే అనుకున్నాడు. ఇంట్లో తమకు దూరం చుట్టం ఏ గతిలేనిది వంటకు వచ్చింది. తనక్రింద సేవచేయడానికి అదేమి గట్టిదని ! కొడుకు వెళ్ళిపోయిన వెంటనే తన వూరి వాడే తన యెదరుగా చేతులు కట్టుకుని నిల్చున్నాడు. సైగచేసి యేం కావాలని అడిగాడు. "రేతిరి పగలు మిమ్మల్ని కాసుకుని మీకింద సేస్తాను." అన్నాడు ఆ వెంకన్న. వద్దన్నట్లు సైగచేసాడు.

కూలి పుచ్చుకున్నోడ్ని పనిసెయ్యనా?" అన్నాడు ? వద్దు వద్దుఅని తలవూపేడు "నాకూలి సిన్నబాబు నెల నెలా నాపేర మనియార్డరు సేసేస్తాడు. తమ రొద్దన్నా యీ యింటి నించిపోను "అన్నాడు. ఇంక వాదించడానికి శక్తి లేదు. బహుశః చదివించినందుకు తను పెట్టిన ఖర్చును కొడుకు యిలా తిరిగి యిచ్చేస్తున్నాడేమోనను కున్నాడు.

అంతా చీకటి. జగమంతా చీకటిలానే వుంది. కన్నీరు కళ్లల్లోనే గడ్డకట్టి దృష్టి మందగించింది. చలికాలమైనా గదిలో వుండలేక పోతున్నాడు. కల్లోలమైన మనసులో మోయలేని ఆలోచనలు బయటవరండాలో చలైనా చుట్టుకనిపించే పరిసరాల్లో పచ్చగానున్న చెట్టుచేమలు నీరు, గాలి, మనుషుల కదలికలవలన కాస్త వుపిరి పీల్చగల నను కున్నాడు. బలవంతం చేసి మళ్ళీ మంచాన్ని వరండాలో వెయ్యించాడు. నల్లనిరగ్గు కప్పు కున్నా, చల్లని చీకటి చుట్టూవున్నా, ఆకాశం నల్లగా వున్నా అందులో అన్ని చుక్కలున్నా - యేవీ కనపడలేదు. ఒక్క చుక్క తప్పించి అది అన్ని చుక్కల కన్నా చాలా కాంతివంతమైనది. అది సూర్యుని కన్నా యెన్ని వేల రెట్లు కాంతి వంతమైనదో? ఐనా మనకు దూరంగా వుండటం వలనదాని ప్రభావం మన మీద పడలేదు. మనుషుల్లోనూ అంతే గొప్ప వాళ్ళు దూరంగా వుంటే మనకేం గొప్ప తెలుస్తుంది. సావిత్రి విషయం తీసుకుంటే తనకేళీ వినోదాల్లో పడి ఆమెకు దూరమైనప్పుడు ఆమె గొప్పతనం తనకు తెలిసిందా? తను మంచంయెక్కి నప్పుడు తనక్రింద సేవచేసి నప్పుడే దగ్గరైంది. అప్పుడే ఆమె గొప్పతనం తెలిసింది! ఆలోచిస్తే తన జీవితం అంతా చీకటి కాదు. ఎంతో కొంత సుఖం వుంది తన జీవితంలో అదేమిటి? తన భార్యవిశ్వాసం. ఆమెను తిరస్కరించినప్పుడు ఆమెలో యౌవ్వనం వుంది. తను యెదుటివాళ్ల భార్యలను చెరచినట్లే యీమె యింకొకరికి లొంగే అవకాశం వుండేది. కాని ఆమెకు ఆమెపై విశ్వాసం వుండటంవలన తనపరువు లోకంలో కాపాడింది. తను కాళ్ళుచేతులు పడిపోయి మంచం మీదపడి వుంటే తన అక్కసునంతా వెళ్ళగక్కేది. కానీ తను బాధపడే ఒక్కమాట, ఒక తృణీకరణ భావం లేకుండా ఆమె ఆరోగ్యానికి కూడా లెఖ్ఖ చెయ్యకుండా నిత్యం సేవచేసింది. స్వశక్తి యందు ఆమెకు విశ్వాసం వుంది. చివరకి శివాలయంకు వెళ్తూదైవం మీద విశ్వాసంతో అన్న మాటలు ప్రకారమే తన వసువు కుంకుమను కాపాడుకుంది. తన సావిత్రి కురూపి కాదు. తన ఆర్జన మీదే ఆధారపడి బ్రతకవలసిన అవసరం కూడా లేదు. కొడుకు ఆర్జన తరువాత మరీ అవసరం వుండేది. కాదు. ఏదీ జీవితంలో మిగల్లేదనుకున్న తనకు తన భార్య విశ్వాసం తలచుకుని ఆనందించటానికి మిగిలింది.

ఏమనిషి జీవితం తీసుకున్నా యేదో కాసింత గర్వకారణం వుంటుందని పించింది. తెల్లవారింది. ☆

